# జరీ అంచు

ఆకాశం మసుపు చేసింది. గాలి నిలిచిపోయింది. టప టప చినుకులు పడసాగాయి. హోటల్ బిల్ చెల్లించి రామ్మూర్తి బయటి కొచ్చాడు.

ఎక్కడా రిక్షా లేదు. గొడుగు తెరిచి రోడ్డు మీదికి అడుగేశాడు. జల్లు ముందునుంచి పడుతోంది. జిప్ బేగ్ తడవకుండా ఛాతీకి దగ్గరగా పెట్టి లాల్చీమీద చినుకులు పడకుండా గొడుగు కిందికి వంచి పట్టుకున్నాడు.

"మాస్టారూ."

వెనకనించి కేక వినిపించి రామ్మూర్తి వెనుదిరిగి చూశాడు. ఒక యువకుడు గబగబ అడుగువేస్తూ గొడుగు కిందికి చేరాడు.

"క్షమించండి, గొడుగులోకి రావచ్చాండి."

"రండి."

రామ్మూర్తి అతన్ని ఓసారి నఖ శిఖ పర్యంతం చూశాడు. చవకబారు టెరిలిన్ షర్టూ, కాస్త పాతపడ్డ రేయాన్ పాంటూ అతని అంతస్థుని పెంచాలని చేసే ప్రయత్నాన్ని ముఖ వర్చస్సు వ్యర్థం చేస్తోంది. చదువుకొన్న మనిషి కాడని రామ్మూర్తి వెంటనే కనిపెట్టాడు.

"నన్ను తీసుకున్నందుకు మరేం అనుకోబోకండి. కొంచెం అర్జంటు పని ఉంది. రిక్షా దొరికితే వెళ్ళిపోతాను."

"పరవా లేదండీ."

ఇద్దరూ నడుస్తున్నారు. వర్షం జోరు హెచ్చింది. అప్పుడప్పుడు మెరుపులు, ఉరుములు మనుషుల్ని బెదిరిస్తున్నాయి. అతను వర్షంమీద, రోడ్లమీద, రాజకీయాలమీద అభిప్రాయాలు ప్రకటిస్తున్నాడు. రామ్మూర్తి పరధ్యానంగా వింటున్నాడు. చిత్తడిగా ఉన్న నేలమీద యిద్దరూ జాగ్రత్తగా నడుస్తున్నారు. జారుడుగా వున్న చోట అడుగేసి కాలు జారి రామ్మూర్తి జర్రున జారి పడబోతుంటే తటాలున అతను పట్టుకున్నాడు.

"ఇంకా నయం పడిపోయే వారు."

"థాంక్స్. పడ్డా లేవగల వయసే లెండి."

"దుస్తులు పాడైపోయేవి గదా!"

"ఔను. ఊరుగాని వూరు. మరో జతకూడా లేదు. మీరు సాయం చేసారు గనుక సరిపోయింది."

అతను పొడిగా నవ్వాడు.

"మీ దీఊరు కాదేంటి?"

"కాదు. పనిమీద వచ్చాను. ఇన్‌కంటాక్సు ఆఫీసరుతో మాట్లాడి తిరిగి వెడుతున్నాను."

"బిజినెస్సా?"

"పూర్వం ఉండేది. నష్టంవచ్చి మానేశాను. అయినా టాక్సు గొడవలు మాత్రం వదల్లేదు."

"అట్లాగా?" అన్నాడతను. అతనియాస రామ్మూర్తికి కొంచెం వింత కలిగించింది.

"మీరేం చేస్తుంటారు?"

"ఉద్యోగానికి ప్రయత్నానికి ప్రయత్నం."

అతను కొంచెం వెకిలిగా అన్నాడు. రామ్మూర్తి నవ్వాడు. ఎదురుగా ఓ రిక్షా వస్తోంది.

"ఖాళీ రిక్షా వొస్తోందండోయ్. వెడతాను. మీ సాయం మర్చిపోను."

"ఏం సహాయం చేశానండీ! ఇంకా నయం. జీవితంలో ఎందరి దగ్గిర్నుంచి నేను ఎంత సహాయం పొందిందీ తెలిస్తే మీరాశ్చర్యపడతారు. ఎందరికో నేను ఋణగ్రస్తుణ్ణి."

"బాకీలకేం లెండి. అందరూ ఎవరికో బాకీ పడుతూనే ఉంటారు.

"అందరి బాకీల్లాంటివి కావు" రామ్మూర్తి ఆవేశంగా అన్నాడు.

"ఆహా!" అన్నాడతను.

ఇంతలో రిక్షా దగ్గిరికి వచ్చింది. అతనా రిక్షాని సమీపించి బేరంకూడా చెయ్యకుండానే లోపలికెక్కి కూర్చున్నాడు.

"వస్తానండి."

"మంచిది."

రిక్షా సాగిపోయింది. రామ్మూర్తి టాక్సీ స్టాండువైపు నడవ సాగాడు. హనుమపల్లికి సరాసరి రోడ్డుఉన్నా బస్సులు పోవు. అయిదుమైళ్లు బస్సుదిగి నడవాలి. రామ్మూర్తికి నడక అలవాటు బొత్తిగా తప్పిపోయింది. టాక్సీమీదైతే రాకపోకలు.

టాక్సీస్టాండ్ చేరి టాక్సీ కుదుర్చుకున్నాడు. టాక్సీ డ్రైవరు పెట్రోలు పోయించుకోటానికి అడ్వాన్సు అడిగాడు. రామ్మూర్తి జేబులో చెయ్యిపెట్టి ఉలిక్కి పడ్డాడు. పర్సు లేదు. ఎలా పోయింది? హోటల్ బిల్ చెల్లించి టాక్సీస్టాండ్ దాకా నడిచేవచ్చాడు. జనంకూడా పలచగా ఉన్నారు. రద్దీలోంచి రాలేదు. ఆఁ — అన్నట్టు, అతనితో నడుస్తున్నప్పుడు తూలి పడబోయాడు. అప్పుడు - కిందపడి పోయిందా? ఊహుఁ కింద పడటానికి అవకాశం లేదు. అతను!

ఇప్పుడేం చేయాలి? రామ్మూర్తి ఆలోచించాడు. చేతి వేలుకి ఉంగరం వుంది. అది అమ్మేస్తే! తప్పదు. పాతికరూపాయలు కావాలి. ఎవరిస్తారు. ఆ ఊళ్లో తను ఎవర్నీ ఎరగడు.

కూడా. పర్స్ పో యిందని టాక్సీ డ్రైవర్‌తో చెప్పకుండా వేరే పనిమీద వెళ్తున్నానని త్వరగా వస్తానని చెప్పాడు.

"అదేమిటి సార్, కారు రెడీగా ఉందికదా. ఎక్కండి పోదాం" అన్నాడతను. కాదని రామ్మూర్తి అక్కడనించి బయలుదేరాడు. వెండి బంగారం నగల దుకాణానికి చేరువగా వచ్చాడు. బోర్డువెపు చూస్తుండగా గొడుగేసుకొని కొట్టు ముందు నిలబడ్డ ఓ వ్యక్తి అతన్ని సమీపించాడు.

"ఏం సార్. ఏం కావాలి? బంగారమేమైనా ఖరీదు చేస్తారా?" రహస్యంగా అడిగాడు.

"కాదు. అమ్మాలి."

రామ్మూర్తి కొట్లోకి వెళ్ళబోయాడు.

"మీరు సరాసరి వెళ్ళి అడిగితే లాభంలేదు సార్. రూల్స్ ప్రకారం బంగారం కొనటం అమ్మటం నిషేధం కదండీ. మీరు సి. ఐ. డీ. ఇన్‌స్పెక్టరేమోనని దుకాణదారు బేరం చెప్పడు" అన్నాడతను.

రామ్మూర్తికి ఆశాభంగమైంది.

"అరె. మరి ఎలా? చాలా అవసరం."

"నేనున్నానుగా సార్, ఏదీ వస్తువు"

రామ్మూర్తి ఉంగరం తీసి అతని కిచ్చాడు. అతను దాన్ని అటూ యిటూ తిప్పిచూశాడు.

"ఇక్కడే ఉండండి సార్. నేను అటు వెనకనించివెళ్ళి బేరం పైసలు చేసుకొస్తాను" అని అతను చప్పున దుకాణం పక్కసందులోకి వెళ్ళాడు.

అరగంట గడిచింది. అతను రానేలేదు. రామ్మూర్తి గత్యంతరంలేక దుకాణంలోకి వెళ్ళి ఉంగరం సంగతి అడిగాడు. అతను తెల్లబోయాడు.

"అదేమిటి సార్, ముక్కూ మొహం ఎరగని వాడికలా యిచ్చారు? మోసగాళ్ళుంటారని తెలీదా. అనుభవం ఉన్న పెద్దవారు."

దుకాణదారు మందలించినట్టుగా అంటున్న మాటలు విని రామ్మూర్తి నిరాశ చేసుకుని బయటికి నడిచాడు. చేతికి వాచ్ ఉంది, రెండువందలు పెట్టి క్రితంసంవత్సరమే కొన్నాడు. అది అమ్మచూపితే —

వాచ్ షాప్ మెట్లెక్కుతూన్న రామ్మూర్తిని చూసి ప్రొప్రయిటరు మర్యాదగా "ఏం కావాలండీ?" అన్నాడు. రామ్మూర్తి వాచ్ చూపించి దాని తాలూకు వివరాలు చెప్పాడు. అతను పెదవి విరచి "సెకండు హాండ్ సెకండ్ హాండే. వంద రూపాయలకి కూడా కొనడం కష్టమే" అన్నాడు. బేరం ఎలాగో వందకి తీర్మానమైంది. పది పదులు తీసుకుని వాచ్ ఇచ్చి రామ్మూర్తి గడప దాటాడు.

"సార్, సార్, ఇందాకట్నుంచీ తిరుగుతున్నాను. వంద రూపాయల నోటుకి చిల్లర ఎక్కడా దొంకలేదు. మీ దగ్గిరుంటే ఇవ్వండి సార్. అవసరంగా ఉంది. అర్జంటుగా మెడికల్ షాపులో మందులు తీసుకెళ్ళాలి."

ప్రాధేయ పడ్డాడు పాలిగోడుగులోని ఒక అసామీ,

రామ్మూర్తికి జాలివేసింది. ప్రాణావసరం కాబోలు. మందులు కొనాలిట. పెట్రోలుబంక్ వాడి దగ్గిర తను మార్చవచ్చు. రామ్మూర్తి వెంటనే పది పదులిచ్చి ఆ వందరూపాయలనోటు తీసుకుని టాక్సీస్టాండ్‌కి తిరిగివెళ్ళి అతనికా నోటిచ్చాడు.

మరి కొంతసేపట్లో పెట్రోల్‌బంక్ దగ్గిర్నుంచి ధుమ ధుమలాడే ముఖంతో అతను తిరిగొచ్చాడు.

"ఏమిటి సార్, మమ్మల్ని జైల్లో వేయిస్తారా?"

"జై లేమిటి?" అన్నాడు రామ్మూర్తి అర్థంకాక?"

"దొంగనోటు మార్చాలని చూస్తే ఏమవుతుంది""

"దొంగనోటా!" రామ్మూర్తి ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్క లేదు.

చిన్నబుచ్చుకున్న ముఖంతో రామ్మూర్తి ఆ నోటందుకుని కాళ్ళీడ్చుకుంటూ నడిచిపోయాడు. భగవాన్. ఇదేమిటి ఇవాళ? ఇప్పుడేం చేసేట్టు! ఊరుగాని ఊళ్ళో యిలా చిక్కుపడిపోయాడు. ఏమిటో పరీక్షగా ఉంది. ఆలోచనగా నడవ సాగాడతను.

డ్రైవర్ హారన్ అదేపనిగా కొడుతున్నాడు. చప్పున తెలివి తెచ్చుకుని రామ్మూర్తి పక్కకి తప్పుకున్నాడు. జీప్ లోంచి ఒకస్వరం వినవచ్చింది.

"రామ్మూర్తిగారూ! నమస్కారం" పరిచితస్వరం విని ఆశ్చర్యంగా అతను తలెత్తిచూశాడు.

ప్రకాశరావు! అసిస్టెంట్ పోలీస్ సూపరింటెండెంట్. రామ్మూర్తికి ప్రాణం లేచి వచ్చింది. ప్రకాశరావు అతనికి కాలేజీలో చదివే రోజుల్లో పరిచయ మయ్యాడు. ఈ మధ్య ఆ పరిచయం వృద్ధి అయింది.

"నమస్కారం ఇలా ఎక్కడికి ప్రయాణం?" "మా ఊరి కే. మీరు?"

"హెడ్ క్వార్టర్స్ కే. జీప్‌లోకి రండి. కలిసిపోదాం. మీ ఊరిమీదుగానే ప్రయాణం."

రామ్మూర్తి సంతోషానికి మేరలేదు. అనుకోకుండా సహాయం లభించింది. వెంటనే జీప్‌లో చోటు చూసుకున్నాడు.

జీప్ సాగిపోతోంది.

"మీ సహాయం దైవసహాయమే. లేకపోతే ఇవాళ నా గతేమయ్యేదో!"

అతనికి ధన్యవాదాలు తెల్పుతూ అన్నాడు రామ్మూర్తి.

"దైవసహాయ మేమిటండోయ్!" అన్నాడు ప్రకాశ రావు.

జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పాడు రామ్మూర్తి. అతను ఆశ్చర్యంగా విని అన్నాడు.

"ఇదేమిటండీ. ఇంత అమాయకులేమిటి? ప్రతివాళ్ళనీ అలా నమ్మేస్తారా! మీ పార్టనర్ గోపాలం పాఠం నేర్పినా

మీరింకా ఇలాగే ఉన్నారన్నమాట. ఆ గోపాలం అంత మంచివాడు, నమ్మదగినవాడు ఎవరూ ఉండరని అంటుండే వారు. నమ్మి వ్యాపారం అతని చేతుల్లో పెడితే ఏం చేశాడో చూశారా? దొంగ లెక్కలు కాకపోతే, వ్యాపారంలో పెట్టుబడితో సహా పోయిందని చెప్పినవాడు ఆరు నెలలు తిరక్కుండా డాబా ఎల్లా కట్టిస్తాడండీ? బిజినెస్ పోయినా టాక్సు గొడవలు మాత్రం నిమ్మల్ని వదల్లేదు. పిల్లిపోయినా పురిటి వాసన పోలేదన్నట్టు. ఇంత అనుభవమయినా ఇంకా మీరు మనుషుల్ని నమ్మి మోసపోతూనే ఉన్నారన్నమాట!"

అతని ఉపన్యాసంవిని దరహాసంతో రామ్మూర్తి అన్నాడు.

"మనుషుల్ని కాకపోతే రాయినీ రప్పనీ నమ్మమంటారా?"

"బాగుంది వరస. నీళ్ళూ పాలూ తెలుసుకోనక్కర లేదా?" అన్నాడు ప్రకాశరావు.

"ప్రకాశరావుగారూ, జీవితంలో నేనెందరినో ఆశ్రయించాను. ఎందరినో నమ్ముకున్నాను. ఎందరో నాకు సహాయం చేశారు. మనుషుల మంచితనంపట్ల నాకు విశ్వాసం లేకుండా ఎలా ఉంటుందిమరి?

"అలాగా?" అన్నాడు ప్రకాశరావు కొంచెం ఎకసక్కెంగా.

"అవును. నాకు ఏడేళ్ళవయస్సున్నప్పుడు ఏటికి వరద లొచ్చాయి. మాది ఏటికి ద ఘ్గూరు, మీకు తెలుసుగా.

అనుకోకుండా రాత్రిపూట ఏరు ఉప్పొంగిపోయి, ఊరు ఊరంతా కొట్టుకుపోయిందిట. నాకు కొద్దిగా జ్ఞాపకం. మా ఇంట్లో అంతా తల్లడిల్లిపోతూ ఎత్తయిన స్థలం చేరుకున్నాం. చెట్టొక పిట్టగా వరద మమ్మల్ని చెదరగొట్టింది. నీళ్ళలో కొట్టుకుపోతున్న ఓ చెట్టుని నేను అంటిపెట్టుకుని ఉండటం చూసి, మా పాలేరు ప్రాణాలకి తెగించి నన్ను కాపాడాడు. ఆ వరదలకి మా కుటుంబం సర్వనాశనమైంది. అమ్మా, నాన్న మరణించారు. మా దూరపు బంధువొకాయన నన్ను చేరదీశాడు. ఆయన బీదవాడు. శక్తి మేరకి చదువుకూడా చెప్పించాడు. కాలేజీ చదువులకోసం ఆ వూరు వదలి పట్నం చేరాను. అడిగిందే తడవుగా కొందరు దయామయులు వారాలిచ్చారు. ఉదారులు మరికొందరు జీతం సహాయం చేశారు. కష్టపడి చదివి బి. ఏ. ప్యాసయ్యాను. నా పరిస్థితి అంతా తెలిసిన ఒక ఉన్నతోద్యోగి నాకు ప్రభుత్వోద్యోగం ఇప్పించాడు. ఆ స్థితిలో ఉన్న నేను ఒక ప్రేమ వ్యవహారంలో కూడా అదృష్టవంతుడి నయాను. అందరూ అందని ఫలం అనుకునే ఆమె నా హృదయాన్ని అర్థం చేసుకుంది. నా మాటలు విశ్వసించి నా జీవితాన్ని పంచుకుంది. ఆమె కలవారి పడుచు. ఆమె ఐశ్వర్యం నా ఉద్యోగానికి స్వస్తి చెప్పింది. అదే సమయంలో ఒక మిత్రుడు వ్యాపారంలో నాకు వాటా ఇచ్చాడు. ఆ తర్వాత నేను స్వంతంగానే వ్యాపారం సాగించాను. చెప్పొచ్చేదేమంటే నా మీద ఎందరికో అవ్యాజంగా ఆదరణ, అనురాగమూ కలగటంవల్లనే నేను సమాజంలో పై మెట్టుకి చేరుకున్నాను, యెందరికో ఋణగ్రస్తుడినయాను."

రామూర్తి మాటల్లోనూ ముఖకవళికల్లోనూ కృతజ్ఞత వెల్లివిరిసింది.

"మీకు తెలిసినా తెలియకపోయినా మీకూ ఎవరో ఋణపడేవుంటారులెండి" అన్నాడు ప్రకాశరావు వ్యంగ్యంగా.

ప్రకాశరావు విస్మయంతో అతని ముఖంలోకి చూశాడు

"మిమ్మల్ని మోసగించిన ఆ వ్యక్తులు మళ్ళీ మీకు కనిపిస్తే ఇంకోసారి మిమ్మల్ని ధన్యుల్ని చెయ్యడానికి వెనుదియ్యరు లెండి."

"మీరనేది నాకర్థమైంది ప్రకాశరావుగారూ, పుట్టినప్పటినుంచి గిట్టేదాకా ఎవరైనా ఎప్పుడో ఒకసారైనా తొట్రుపాటు పడకమానరు. అవి ఆ వ్యక్తి దుర్బలక్షణాలు. తర్వాత పశ్చాత్తాప పడేవాళ్ళు చాలామంది ఉంటారు. ఓ సారి తప్పుచేసిన వ్యక్తి మళ్ళీ ఎప్పుడూ ఆ తప్పు చెయ్యకపోవటానికి అవకాశం చాలా ఉంది"

"బాగుంది మీ థీసిస్. మీలో ఆశావాదం చాలా ఉంది" విసుగ్గా అన్నాడు ప్రకాశరావు.

"ఆ దుర్బల క్షణాలు యెవరి జీవితంలో యెప్పుడు వస్తాయో మనకి తెలీదు. అవి వచ్చేదాకా అందరూ మంచివాళ్ళేకదా!"

"సమయానికి నా జీప్ కనిపించకపోతే, ఈ మాటలు మీరు అసగలిగేవాళ్ళేనా, నిజం చెప్పండి."

ప్రకాశరావు రామ్మూర్తి ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

రామ్మూర్తి చిరునవ్వు నవ్వాడు.

"ఇలాంటి అనుభవాలు నాకు కొత్తకావు. సమాజం నాకు ఆస్తి, అంతస్తు ఇవ్వకపోతే నా దృక్పథం మరోవిధంగా ఉండేదేమో. కాని ఒక్కటిమాత్రం నిశ్చయంగా చెప్పగలను. సమాజపు తొట్టెలో పాలూ, నీళ్లూ కలిసిఉంటాయి. పాలని మాత్రమే వేరుచేసి త్రాగటానికి మనుషులు హంసలుకారు. ఈ జ్ఞానం నాకు తొలి అనుభవాలే యిచ్చాయి ప్రకాశ రావుగారూ!"

ప్రకాశరావు ఏమనటానికి తోచక ఒక్కక్షణం ఊరుకొని, తటాలున అన్నాడు.

"మీరు నాకు మిత్రులు రామ్మూర్తిగారూ. కాని ఉద్యోగధర్మం మైత్రినే లక్ష్యపెట్టదు క్షమించండి, మీరు దొంగనోటు దగ్గర ఉంచుకున్నందుకు పోలీసువారికి సంజాయిషీ చెప్పుకోవాలసిన అవసరం ఉంది. మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాను."

గంభీరంగా వచ్చిన ఆ వాక్కులు విని రామ్మూర్తి స్తబ్ధుడయ్యాడు.

"ఆ నోటు ఇలా ఇవ్వండి."

యాంత్రికంగా రామ్మూర్తి జేబులో చెయ్యిపెట్టాడు. భ్రుకుటిముడిచాడు. లేచి చుట్టూచూశాడు. జేబులు మళ్ళీ మళ్ళీ వెతికాడు.

"మైగాడ్, రెండోసారి యివాళ నాజేబు యెవరో కొట్టేశారు, సూపరింటెండెంట్ గారూ!"

ప్రకాశరావు తెల్లబోయాడు.

"నిజమా?" అతని స్వరంలో అనుమానం ప్రస్ఫుటమైంది.

"సోడా చెయ్యండి" అన్నాడు రామ్మూర్తి.

ప్రకాశరావు మారు మాట్లాడలేదు. జీప్ రొదచేస్తూ ముందుకి సాగిపోతోంది. ఉన్నట్టుండి అతను ఆకాశంవైపు వేలుపెట్టి చూపిస్తూ, 'రామ్మూర్తిగారూ. ఆ నల్లటి మబ్బుకి తెల్లటి అంచు జరీలాగా బాగుంది కదూ?" అన్నాడు.

రామ్మూర్తి మందహాసం చేశాడు.